822) నాట

ప॥ నానామహిమల శ్రీనారసింహము। పూని మమ్ము రక్షించీ పొగడెద నిదిగో॥

చ॥ కొండవంటి వేదాద్రిగుహల్లో సింహము। దండి భవనాశియేటిదరి సింహము।
అండ నారుశాస్త్రముల అడవిలో సింహము। నిండి అహోబలముపై నిక్కి చూచీ నదిగో॥

చ॥ దిట్ట యోగీంద్రుల మతితెర మఱుగు సింహము। జట్టిగొన్న శ్రీసతితో జంటసింహము।
పట్టి దైత్యుల వేటాడే బలుదీము సింహము। మెట్టి అహోబలముపై మెఱసీదా నదిగో॥

చ॥ పలుదేవతల వెనుబలమైన సింహము। కెలసి కంబాన చెనగిన సింహము।
అలరి శ్రీవేంకటేశు డైనట్టి సింహము। కొలువై అహోబలాన గురుతాయ నిదిగో॥